ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
సోమవారం 7 మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm

# డీలిమిటేషన్‌పై కొన్నిఅభ్యంతరాలున్నాయి

ఎమ్మెల్సీ కోదండరాం

హైదరాబాద్: కేంద్ర చేపట్టబోయే.. పార్లమెంటు నియోజకవర్గాల డీలిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాలకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఈ డీలిమిటేషన్ వ్యవహారంపై హైదరాబాద్ లో రౌండ్ టేబుల్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కొదండరామ్ హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సౌత్ రాష్ట్రాల ప్రజలు తీవ్రంగా పరిగణించాల్సి అవసరం ఉందని, లేదంటే నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. పన్ను వసూళ్లలో ఉత్తరాది కంటే దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ వాటా చెల్లిస్తున్నాయన్నారు. కానీ ఉత్తరాదికి ఎక్కువ నిధులు కేటాయిస్తూ.. దక్షిణ రాష్ట్రాలకు మోసం చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా



డీలిమిటేషన్‌తో దక్షిణాదిలో సీట్లను తగ్గిస్తే.. తీవ్రంగా నష్టపోతమని, దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు.



## భూముల భూ వివాదంపై
# విచారణ... 24కు

హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంపై హైకోర్టు విచారణ ఈనెల 24వ తేదీకి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. అలాగే కోర్టుకు కౌంటర్, రిపోర్ట్‌ను ఈ నెల 24 లోగా సమర్పించాలని సంబంధిత అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ పరిణామాలతో హైదరాబాద్ యూనివర్సిటీ భూముల వివాదం మరింత కీలకంగా మారింది. సోషల్ మీడియా వేదికగా అసత్యపు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విచారణ సందర్భంగా న్యాయపరమైన నివేదికలు, వాస్తవ ఆధారాలతో కూడిన వివరాలు కోర్టుకు సమర్పించనున్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా ఫేక్ వీడియోలు, తప్పుడు ఫోటోలను ప్రసారం చేస్తూ కావాలనే వివాదం సృష్టిస్తున్న దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఫేక్ ప్రచారంలో యూనివర్సిటీ భూములను అక్రమంగా ఆక్రమించారని, పర్యావరణాన్ని ధ్వంసం చేశారనీ, వన్యప్రాణులకు నష్టం వాటిల్లిందంటూ ఊహాగానాలు వ్యాప్తి చెయ్యడం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందిస్తూ, ఈ తప్పుడు ప్రచారంపై చట్టపరంగా కోర్టుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. దీనితో ఆ కేసు నేడు విచారణ చేపట్టారు.

# కొత్త ఎమ్మెల్సీల ప్రమాణం

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలో స్వీకార కార్యక్రమం

### బీజేపీ నుంచి ఇద్దరు, కాంగ్రెస్ నుంచి నలుగురు

### పీఆర్టీయూ నుంచి ఒకరు

హైదరాబాద్ : రాష్ట్రంలో ఇటీవల జరిగిన రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు సోమవారం శాసన మండలిలో ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. బీజేపీ తరపున మల్కా కొమురయ్య, అంజి రెడ్డి ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. కార్యక్రమానికి బీజేపీ నుంచి ముఖ్య నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎం. లక్ష్మణ్, రఘునందన్ రావులు హాజరయ్యారు.

కాంగ్రెస్ నుంచి కూడా..

ఇక మరోవైపు, ఎమ్మెల్యే కోటా నుంచి కాంగ్రెస్ పార్టీకి



చెందిన విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యంలు శాసన మండలికి నూతనంగా ఎన్నికయ్యారు. వీరికి కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తరపున మంత్రులు ధానికోట శ్రీధర్ బాబు, నక్కా ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించి శాసన మండలిలో సభ్యుడిగా ప్రమాణం చేశారు.



# యువత మీదే భవిత: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: వివిధ పరిశ్రమల అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యున్నత స్థాయి నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆయన సోమవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్ సీఐ )లోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించారు. విశ్వవిద్యాలయ అధికారులతో సమీక్షా సమావేశం తర్వాత, తెలంగాణను అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరుల కేంద్రంగా మార్చే లక్ష్యంతో వ్యూహాత్మక దార్శనికతను మంత్రి వివరించారు.

తెలంగాణ యువత అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నారని, మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా లక్ష్య శిక్షణతో, వారిని ప్రపంచవ్యాప్తంగా పోటీ నిపుణులుగా మార్చవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠ్యాంశాలను రూపొందించడంలో పరిశ్రమ వాటాదారులతో నిరంతర సహకారం కోసం, కోర్సులు వాస్తవ ప్రపంచ డిమాండ్లను ప్రతిబింబించేలా చూసుకోవాలని ఆయన సూచించారు. అధిక డిమాండ్ ఉన్న నైపుణ్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గ్రామీణ నేపథ్యాల నుండి వచ్చిన అభ్యర్థులు సాఫ్ట్ స్కిల్స్‌లో కేంద్రీకృత శిక్షణ పొందాలన్నారు. విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసిన తర్వాత పరిశ్రమలకు సిద్ధంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రధాన విద్యా, పరిశోధనా కేంద్రాలు, టాస్క్ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఇఇటీ) వంటి కీలకమైన రాష్ట్ర సంస్థలతో సన్నిహితంగా సమన్వయం చేసుకోవాలని కూడా ఆయన విశ్వవిద్యాలయాన్ని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డిప్యూటీ కార్యదర్శి భవేష్ మిశ్రా, స్కిల్ యూనివర్సిటీ వైస్–ఛాన్సలర్ సుబ్బారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేత క్రిశాంక్ కు నోటీసులు

### ఈనెల 9, 10, 11వ తేదీల్లో విచారణ

### హెచ్సీయూ అంశంపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టుల.. అభియోగం

హైదరాబాద్ : హైదరాబాద్ కంచె గచ్చిబౌలి ప్రాంతంలోని భూ వివాదంతో పాటు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అంశంపై సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసిన బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూములపై ఏఐ ఆధారంగా తప్పుడు పోస్టులు చేశారనే అభియోగంతో ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఈ నెల 9, 10, 11 తేదీలలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు విచారణకు హాజరుకావాలని కోరుతూ నోటీసులు అందజేశారు.

### నేను ఏఐను ఉపయోగించలేదు : క్రిశాంక్

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. నేను ఎక్కడా AI ఉపయోగించలేదని.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫోటోలు, వీడియోలు అన్నీ వాస్తవమేనని తెలిపారు. ఆ ప్రాంతంలోని జింకలు రోడ్లపైకి వచ్చాయని.. అందులో కొన్ని ఇళ్లలోకి వెళ్లిన దృశ్యాలు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇవన్నీ ప్రజలే తీసిన వీడియో లేనని, తాము చట్టబద్ధంగా ఈ నోటీసులను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు క్రిశాంక్.



# గాజాపై దాడులు.. 32 మంది మృతి

హమాస్: హ మాస్ పై ఒత్తిడి పెంచే క్రమంలో గాజాపై ఇజ్రాయెల్ నిర్దయగా విరుచుకుపడుతోంది. తాజాగా గాజా పట్టిపై ఇజ్రాయెల్ రక్షణదళం-ఐడీఎప్ చేసిన దాడిలో 32మంది పౌరులు మృతి చెందినట్లు పాలస్తీనా వైద్య అధికారులు తెలిపారు. మృతుల్లో ఎక్కువమంది చిన్నారులు, మహిళలే ఉన్నారని తెలిపారు. ప్రతిగా ఇజ్రాయెల్ నగరాలపై..హమాస్ రాకెట్లతో దాడులు చేసినట్లు సమాచారం. ఇజ్రాయెల్ దాడిలో..... పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. తాజా వైమానిక దాడుల్లో మరణించిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన 9 మందితో పాటు ఐదుగురు పసిపిల్లలు, నలుగురు మహిళలు ఉన్నారని.... నసీర్ ఆసుపత్రి వైద్యులు తెలిపాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.... నేడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సమావేశంకానున్నారు. ఈ భేటీలో..... హమాస్ పై ఇజ్రాయెల్ యుద్ధం, బందీల విడుదల, ఇరాన్ అణుసంక్షోభం, తమ దేశంపై విధించిన 17శాతం టారిఫ్ లపై..... చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# చపాతీలు చేయనందుకు చితకబాధిన వార్డెన్

కొత్తగూడెం : చపాతీలు చేయనందుకు విద్యార్థినులను చితకబాధిన ఉదంతం వెలుగు చూసింది. కొత్తగూడెం.. రామవరంలోని గిరిజన బాలికల గురుకులంలో 600 మంది విద్యార్థినులు విద్య అభ్యసిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకి 8 వ తరగతి విద్యార్థినులను అల్పాహారం కోసం చపాతీలు చేసేందుకు గురుకుల వార్డెన్ నిద్రలేపింది. కొందరు విద్యార్థినులు లేచి చపాతీలు చేస్తుండగా, 21 మంది విద్యార్థినులు నీరసంగా ఉందని చెప్పి నిద్ర లేవలేదు. దీనిని మనసులో పెట్టుకొని వార్డెన్ ఉదయం 11 గంటల ప్రాంతంలో గదిలో కర్రతో వారిని చితకబాదింది.

కొందరు విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో గురుకుల పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అక్కడున్న ప్రిన్సిపాల్, సిబ్బంది తల్లిదండ్రులను బతిమిలాడి ఇంకోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకుంటామని సర్ది చెప్పారు. గురుకులం ప్రిన్సిపాల్ ని వివరణ అడగగా వార్డెన్ విద్యార్థినులను కొట్టింది నిజమే అని, సదరు వార్డెన్ కి మెమో జారీ చేశామని తెలిపారు.

# ఆ ప్రచారం రాంగ్ : వైష్ణవి చైతన్య

సినిమా : టాలీవుడ్ లో తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావు అనే ప్రచారం ఎందుకు జరిగిందో కానీ... ఆ ప్రచారం వల్లే చాలా మంది అమ్మాయిలు ఇండస్ట్రీకి రావాలనే ఆలోచన చేయడం లేదని బేబీ ఫేం నటి వైష్ణవి చెప్పింది. ఇండస్ట్రీలోకి రావాలనే ప్రయత్నమే చేయకపోతే ఎలాగని ప్రశ్నించింది. ఓపికతో ప్రయత్నిస్తే అవకాశాలు వస్తాయని, దానికి తానే ఉదాహరణ అని చెప్పింది. అవకాశాలు రావు అని భయపడి ఆగిపోయే బదులు గట్టిగా ప్రయత్నిస్తే అవకాశాలు మీ తలుపు తడతాయని, ఇండస్ట్రీలోకి రావాలనుకునే వారికి ఇదే తానిచ్చే సలహా అని చెప్పారు. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ లో వైష్ణవి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. తొలి సినిమా 'బేబి'తో స్టార్ అయిపోయింది. ప్రస్తుతం హీరో సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటిస్తోంది.

